క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున గురువారం మండల కేంద్రం తోపాటు తిర్పెల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలనీవాసుల చేయూత



సాయం అందిస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన అమంద కిరణ్ ఈనెల 3న అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో బాధిత కుటుంబానికి బుధవారం కాలనీవాసులు రూ.16,500 నగదుతోపాటు క్వింటాల్ బియ్యం అందజేశారు.

సాగునీరు అందించాలి



ఈఈ విఠల్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కడెం: కడెం ఆయకట్టుకు సరిపడా సాగు నీరందించాలని బుధవారం మండలకేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఈఈ విఠల్‌కు సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. మే 5 వరకు సాగు నీటిని అందిస్తేనే పంటలు చేతికి వస్తాయని ఈఈని కోరారు. ఇందులో నాయకులు నూతన్‌కుమార్, తిరుపతి, విలాస్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

మేరు సంఘ కార్యవర్గం



మిఠాయి తినిపిస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని మేరు సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా రాజుల దేవి లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా సింగు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా రామగిరి నరేందర్, కోశాధికారిగా రాజులదేవి గంగేశ్, ప్రధాన కార్యదర్శిగా కొడిగంటి నర్సయ్య, ముఖ్య సలహాదారులుగా రామగిరి నరేశ్, కె.గంగనర్సయ్య, గట్ల రాజేశ్వర్, పి.భూమేశ్వర్, సింగు రవి ఎన్నికయ్యారు. అనంతరం సంఘ అభివృద్ధికి స్థానిక కంటి వైద్యులు డాక్టర్ కె.సన్నిత్‌కుమార్ రూ.10వేలను ఆర్థిక సాయంగా అందజేశారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

ఖానాపూర్: గ్రామాల్లో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని గోసంపల్లె, కొత్తపేట్, గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీల రికార్డులను తనిఖీ చేశారు. అంతకుముందు పారిశుద్ధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

గోశాలకు చొప్ప అందజేత



డీసీఎం వద్ద రైతు రమేశ్

కుభీర్: మండలంలోని పల్సి గ్రామానికి చెందిన కొండల్‌వార్ రమేశ్‌గౌడ్ తన చేనులోని రూ.20వేల విలువైన మొక్కజొన్న చొప్పను ఎనిమిది డీసీఎం వాహనాల్లో తీసుకెళ్లి భైంసాలోని గోశాలకు అందించారు. ఈసందర్భంగా ఆయనను గోశాల నిర్వాహకులు, పల్సి గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెంలో యూత్ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దేవునిగూడెం, దస్తురాబాద్ జట్లు తలపడ్డాయి. విజేతగా నిలిచిన దస్తురాబాద్ జట్టుకు రూ.12వేలు, రన్నరప్‌గా నిలిచిన దేవునిగూడెం జట్టుకు రూ.6వేలను పీఏసీఎస్ డైరెక్టర్ చుంచు వెంకన్న అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, నరేశ్‌రెడ్డి, దేవునిగూడెం గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తనిఖీ చేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ గౌతమ్



కుంటాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

కుంటాల: ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఆదర్శ పాఠశాలలో 432 మంది విద్యార్థులకు గానూ 407 మంది పరీక్షకు హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కాసు నవీన్‌కుమార్, డీవోబీ సంతోష్ తెలిపారు. ఎస్సై భాస్కరాచారి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లోకేశ్వరం: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చీఫ్ సూపరింటెండెంట్ గౌతమ్ అన్నారు. లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. 114 మంది విద్యార్థులకు గాను 108 మంది పరీక్షలు హాజరైనట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బలరాం, డీవో బాలనంద్ ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెయిన్‌బో, వశిష్ఠ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 956 మంది విద్యార్థులకు గాను 62 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముధోల్: మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకులంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 367 మంది విద్యార్థులకు గాను 328 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 329 మందికి గాను 315 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మోహినొద్దీన్ తెలిపారు. పర్యవేక్షకురాలు లావణ్య, ఫ్లయింగ్ స్క్వాడ్‌గా జాదవ్ ఉన్నారు. గురుకులం పరీక్ష కేంద్రం వద్ద అమ్మ పరీక్షకు హాజరవగా బయట తండ్రి కుమారుడిని ఆడిస్తున్న దృశ్యం కన్పించింది.



ముధోల్ గురుకులం వద్ద కొడుకును ఆడిస్తున్న తండ్రి

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 78 మంది విద్యార్థులకు గాను 74 మంది పరీక్ష రాసినట్లు సీఎస్ ఫణి రాజశేఖర్ తెలిపారు. పరీక్ష కేంద్రం 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 293 మంది విద్యార్థులకు గాను 10 మంది, ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో 319 మందికిగాను 35 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాళ్లు అబ్దుల్ హమీద్, భూక్య రమేశ్‌నాయక్ తెలిపారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 319 మంది విద్యార్థులకు గాను 308మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు సీఎస్ శంకర్ తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

కడెం: మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో 277 మంది విద్యార్థులకు గాను 273 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాజన్న తెలిపారు. నలుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

'మహిళా సాధికారత సాధనలో విఫలం'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఆధునిక సమాజంలోనూ అనేక మంది మహిళలు వంటింటికే పరిమితం అవుతున్నారని.. మహిళా సాధికారత సాధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు భాను బేగం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకురాలు చుక్కల కళ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా 115వ అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవాన్ని ఎలుగెత్తి చాటాలన్నారు. మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల్లో జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 8న నిర్మల్‌లో జరిగే జిల్లా సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సుధాకర్, నాయకులు కవిత, శిరీష, మీనా, అరుణ, నర్సు, సంజీవ్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

గాంధీభవన్ సమావేశంలో జిల్లా నాయకులు



సమీక్షా సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశం బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి డీసీసీ అధ్యక్షుడు, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని సూచించారు. పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంత్రి సీతక్క, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథం, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ముధోల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యేలు బి.నారాయణ్‌రావు పటేల్, జి.విఠల్‌రెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ఇతర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- నలుగురికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని ముధోల్ ఆసుపత్రి నుంచి భైంసాకు తరలిస్తున్న గ్రామస్తులు

ముధోల్: మండలంలోని విఠోలి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్ మండలంలోని అష్ట గ్రామానికి చెందిన కళావతి, శోభ, సాయన్న, లక్ష్మీ పని నిమిత్తం ముధోల్‌కు వచ్చారు. సమయానికి బస్సులు లేకపోవడంతో ఆటోలో తిరిగి అష్ట గ్రామానికి బయలుదేరారు. ముధోల్ నుంచి విఠోలి తండా వరకు బీటీ రోడ్డు పనులు నడుస్తుండడంతో ఆటో అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో డ్రైవర్ నర్సయ్యకు స్వల్ప గాయాలవగా అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108వాహనంలో భైంసా ఆసుపత్రికి తరలించినట్లు బాధితుల కుటుంబీకులు తెలిపారు. నలుగురికి చేతులు విరిగినట్లు సమాచారం. ఈ విషయమై ముధోల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించినట్లు బాధితులు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో నసీరొద్దీన్

తానూరు: ఎండలు పెరుగుతున్నందున గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చూడాలని.. అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో నసీరొద్దీన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. నీటి సమస్య పరిష్కారమై పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి క్లోరినేషన్ నీటిని ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొలకలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో గంగాధర్, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

కూలీలు పనులకు వచ్చేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమేశ్

లోకేశ్వరం: ఉపాధిహామీ పనులకు కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు అందించి.. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలి



మాట్లాడుతున్న భూమన్న యాదవ్

నిర్మల్‌రూరల్: పదోతరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురవకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని మోటివేషనల్ స్పీకర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటివరకు చదివిన అంశాలను రివిజన్ చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నిత్యం 15 నిమిషాలు ధ్యానం చేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అల్లం రవిబాబు, ఉపాధ్యాయులు దత్తురాం, వసంత్‌రావ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, గంగాధర్, సుంక రాజన్న, వినోద్, శ్రీమంత్, రమణ, మంజుల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌ఐలు



తహసీల్దార్‌ను కలిసిన ఆర్‌ఐలు

దస్తురాబాద్: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన ఆర్‌ఐలు ఆర్తి, రచన బాధ్యతలు స్వీకరించారు. వీరు గతంలో నర్సాపూర్, భైంసా మండలాల్లో జూనియర్ అసిస్టెంట్‌లుగా పని చేసి ఆర్‌ఐలుగా పదోన్నతి పొంది దస్తురాబాద్ వచ్చారు. వీరికి తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ నియామక పత్రాలు అందించారు. ఇక్కడ ఆర్‌ఐగా పని చేసిన గంగన్న బదిలీపై కడెం వెళ్లారు. ఆర్‌ఐని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, సిబ్బంది సన్మానించారు.

ప్రమాదకర గుంతను పూడ్చరూ



లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. నిత్యం గుట్ట నుంచి భారీసంఖ్యలో టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు ధ్వంసమైంది. వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్: జిల్లాలోని ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఈ నెల 7లోపు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రకాల డిక్లరేషన్లతో కలిపి దరఖాస్తులు అందించాలని సూచించారు.

ముగిసిన జాతర

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో బాపూజీ మహారాజ్ జాతర బుధవారం ముగిసింది. సమీప గ్రామాలతోపాటు మహారాష్ట్ర ప్రాంతం నుంచి వందలాది మంది ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కీర్తన నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

'నిందితులను శిక్షించాలి'

ముధోల్: గిరిజన లంబాడాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ఫొటో దిమ్మెను తొలగించడం బాధాకరమని.. వెంటనే నిందితులను శిక్షించాలని గిరిజన నాయకులు గడ్డెన్న అన్నారు. బుధవారం ఆయన ముధోల్‌లో విలేకరులతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని లోయపల్లితండాలో జరిగిన ఈ ఘటనను ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

నర్సరీ పరిశీలన

కుంటాల: మండలకేంద్రంలోని నర్సరీని ఎంపీడీవో లింబాద్రి బుధవారం పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా నీళ్లు అందించాలని సూచించారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నర్సాపూర్ (జి): మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన రాథోడ్ మారుతి (44) పది రోజుల కిందట ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో బుధవారం రాథోడ్ మారుతి భార్య రాథోడ్ అరుణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

అయోడిన్ వినియోగంపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని పొర్లెపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐటీసీ వారి ఆధ్వర్యంలో అయోడిన్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధి శివశంకర్ మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ సరైన మోతాదులో లేకుంటే విద్యార్థులకు బుద్ధి మాంద్యం ఏర్పడటంతోపాటు గాయిటర్ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు గంగాసురేశ్, రవికుమార్, ప్రమోద్, ఆదిల్ పోశెట్టి, సరళ, వాణిశ్రీ పాల్గొన్నారు.

మామిడి తోటలు పరిశీలన



తోట వద్ద పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి స్పందన

కడెం: పిందెలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు మామిడి తోటలకు 25 నుంచి 30రోజులకోసారి తేలికపాటి నీటి తడులివ్వటం ద్వారా పిందెలు రాలడం కొంత తగ్గించవచ్చని ఖానాపూర్ క్లస్టర్ ఉద్యాన అధికారి ఎం.స్పందన పేర్కొన్నారు. బుధవారం కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లో మామిడి తోటలను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్లానోఫిక్స్ ఒక మిల్లీలీటర్‌ను నాలుగున్నర లీటర్లకు కలిపి తోటకు పిచికారీ చేయడం ద్వారా పూత, పిందె రాలకుండా ఉంటుందన్నారు. పిందె దశలో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ (మల్టీకే) 10 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే కాయల నాణ్యత పెరుగుతుందన్నారు. తేనె మంచు పురుగు ఆశిస్తే ఫాస్ఫోమిడాన్ 5 మిల్లీలీటర్లను.. 10 లీటర్ల నీటిలో లేదా ప్రొఫినోఫాస్ 1.5మి.లీని ఒక లీటర్ నీటిలో లేదా క్లోరోఫిరినోఫాస్ 2.5 మి.లీను..లీటర్ నీటిలో కలిపి చెట్ల మొదళ్లు, కొమ్మలపై పిచికారీ చేయాలని సూచించారు.

తాత్కాలిక రోడ్డుపై తప్పిన ప్రమాదం



మట్టిలో కూరుకుపోయిన లారీ

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులో రెంకోనివాగుపై వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై వాహనాలు అదుపు తప్పగా పెనుప్రమాదం తప్పింది. తర్లపాడ్ నుంచి ఖానాపూర్ వస్తున్న బులెరో వాహనం, మక్కల బస్తాల లోడ్ లారీ ఒకదానినొకటి క్రాస్ చేయబోయి తాత్కాలిక రోడ్డు మట్టి కట్టలో కూరుకుపోయాయి. దీంతో రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. అనంతరం మూడు జేసీబీలను రప్పించి వాహనాలను బయటకు లాగారు. పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. తలుపు ఇలా.. వెళ్లేదెలా?



లోకేశ్వరం: మండలకేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్డికి నీటి సౌకర్యం ఉన్నా.. తలుపునకు మాత్రం పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో సిబ్బంది, అక్కడికి వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులు ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి:
గిరిరాజ్, లోకేశ్వరం వ్యవసాయాధికారి,
ఫోన్: 72888 77916

పంట సందర్శనలో విద్యార్థులు



తోట వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

సోన్: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని జాప్రపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామానికి సమీపంలో ఉన్న ఆయిల్ పాం తోటలను బుధవారం సందర్శించారు. ఆయిల్‌పాం సాగు, దిగుబడి, మార్కెటింగ్ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్, ఇన్‌చార్జి ఎంఈఓ పరమేశ్వర్, ఉపాధ్యాయులు నాగేష్‌కుమార్, విజయమాల, ఆసిఫ్ అలీ, అనుపమ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.